## క్లుప్తంగా...

### నేడు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం

బన్సీలాల్‌పేట్: ముషీరాబాద్ ప్లేగ్రౌండ్స్‌లో ఆదివారం ఉచిత కేన్సర్ స్క్రీనింగ్, వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు రాంపురం రాజేష్ గౌడ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తన తల్లి దివంగత రాంపురం సులోచన జ్ఞాపకార్థం ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. తానా ఫౌండేషన్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మొమోగ్రఫి, గర్భాశయ స్కానింగ్, పాప్‌స్మియర్, ఊపిరితిత్తుల ఎక్స్‌రే, ర్యాండమ్ బ్లడ్ షుగర్, బీపీ, బీఎంఐ, క్లినికల్ ఎగ్జామినేషన్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారన్నారు. వివరాలకు 99490 88875 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### లాభాల పేరుతో టోకరా

అమీర్‌పేట: పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని మోసాలకు పాల్పడిన సంఘటన శనివారం ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అమీర్‌పేట బీజేఆర్‌నగర్‌కు చెందిన ఓడెల సాయికృష్ణ అనే వ్యక్తి టెలిగ్రామ్ ఐడీకి ఓ మెసేజ్ వచ్చింది.ఇన్వెస్ట్‌మెంట్ గ్రూప్‌లో పెట్టుబడి పెడితే తక్కువ కాలంలో రూ.3 లక్షల లాభం వస్తుందని నమ్మించారు. మొదటగా రూ.12 వేలు, మరోసారి రూ.20 వేలు పెట్టుబడిగా పెట్టగా, మీ డబ్బులు రెట్టింపయ్యాయని మరో రూ.60 వేలు చెల్లిస్తే రూ.3 లక్షలు వస్తాయని నమ్మించడంతో డబ్బులు చెల్లించాడు.డబ్బులు ఇవ్వక పోగా ఫోన్లు చేసినా స్పందించక పోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

**క్రెడిట్ కార్డు పరిమితి పెంచుతామని..**

క్రెడిట్ కార్డు పరిమితి పెంచుతామని మోసం చేయడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. బోరబండ కేఎస్‌నగర్‌కు చెందిన సువర్ణ సెల్‌కు ఫోన్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డు విభాగం నుండి మాట్లాడుతున్నామని, మీ క్రెడిట్ కార్డు పరిమితి పెంచుతామని చెప్పడంతో వారు అడిగిన వివరాలు పంపింది.ఓటీపీ నెంబర్ కూడా చెప్పడంతో రూ.97 వేలు గల్లంతు కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

### మే డే వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆటో యూనియన్ నేతలు

లాలాపేట: ఏఐటీయూసీ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో రూపొందించిన మే డే వాల్ పోస్టర్‌ను శనివారం తార్నాక చౌరస్తాలో ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు ఆవిష్కరించారు. ఆటో యూనియన్ నాయకులు షేక్ లతీఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్ ఉమర్ ఖాన్ మాట్లాడుతూ ప్రపంచ కార్మిక సంఘీభావ దినోత్సవం మే డే విజయవంతం చేయాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నగర అధ్యక్షులు కొమురెల్లి బాబు, మహ్మద్ అఖీల్, టి. సంజు, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.

# కళాసీగూడలో విషాద ఛాయలు

- నాలాలో పడి చిన్నారి మృతి
- అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పలు పార్టీల నేతలు



మౌనిక భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోట నీలిమ

రాంగోపాల్‌పేట్: నాలాలో పడి మౌనిక అనే బాలిక మృతి చెందడంతో కళాసీగూడలోని విషాద ఛాయలు నెలకొన్నాయి. కళాసీగూడ ధన్‌బజార్‌కు చెందిన శ్రీనివాసులు, రేణుక దంపతుల కుమార్తె మౌనిక ఆర్పీరోడ్డులోని ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి పూర్తి చేసింది. శనివారం ఉదయం పాల ప్యాకెట్ తీసుకువచ్చేందుకు తన అన్న కార్తీక్‌తో కలిసి వెళుతూ నాలాలో పడి మృతి చెందింది. ఈ ఘటనపై సమాచారం అందడంతో పలువురు నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర, మోండా కార్పొరేటర్ కొంతం దీపిక, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్ తదితరులు బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అధికారులతో కలిసి గాలింపు చేపట్టిన స్థానిక నాయకులు బాలికను బయటికి తీసుకువచ్చి మార్చురీకి తరలించారు. అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పరామర్శల వెల్లువ..**

బాధిత కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, డిప్యూటీ మేయర్ శ్రీలత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు సుచిత్ర శ్రీకాంత్, కొంతం దీపిక, సరళ, మధుసూదన్,నరసింహారెడ్డి, భాగ్యలక్ష్మి, మహాలక్ష్మి, రాజ్యలక్ష్మి, శ్రవణ్, పద్మాదేవేందర్‌రెడ్డి, శంకర్‌యాదవ్ యువజన కాంగ్రెస్ నాయకులు అనిల్‌కుమార్ యాదవ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట నీలిమ మౌనిక ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులను ఓదార్చారు. ప్రభుత్వపరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

### తండ్రికి అనారోగ్యం.. అన్న మానసిక వికలాంగుడు

మృతురాలి తండ్రి శ్రీనివాసులు స్థానికంగా గోల్డ్‌స్మిత్‌ల వద్ద పనిచేస్తుంటాడు. అతడికి తరచు ఫిట్స్ వస్తుండటంతో ఎవరు పనిలోకి పెట్టుకునేందుకు ఇష్టపడకపోవడంతో ఇంటివద్దే చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి కుమారుడు కార్తీక్ మానసిక వికలాంగుడు కావడంతో స్వీకార్ ఉపకార్‌లో చికిత్స అందిస్తున్నారు. మౌనిక తల్లి ఇంటి వద్దే చిన్న గదిలో చాక్లెట్స్, బిస్కెట్లు విక్రయిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది.

# ఆర్థిక స్వావలంబన సాధించాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని మహిళలు, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని కేంద్ర టూరిజం శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం అటల్ బిహారీ వాజపేయి (ఏబీవీ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న 1200 మంది మహిళలకు పార్శిగుట్ట మధురానగర్‌లో సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ఏబీవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణలు కొనసాగుతున్నాయన్నారు. త్వరలో మరిన్ని కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు కసరత్తు చేస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఫౌండేషన్ తరఫున చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణాలు అందించేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీమన్నారు. మే 20, 21 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ ప్రాంగణంలో భారీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళలకు వృత్తి శిక్షణ కోర్సులను నిర్వహించడంలో అంకితభావంతో కృషి చేస్తున్న మేకల కీర్తి హర్షకిరణ్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటరీ ఇన్‌ఛార్జి రాజశేఖరరెడ్డి, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాం సుందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి, పార్టీ నగర నాయకులు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, ఆదం విజయ్‌కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, శారదామల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# మూలాలను మరచిపోరాదు



మాట్లాడుతున్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి

రసూల్‌పురా: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకున్న తర్వాత తమ గ్రామాన్ని, కుటుంబాన్ని, సమాజాన్ని మరచిపోరాదని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. సికింద్రాబాద్ పీజీ కళాశాలలో శనివారం జరిగిన విద్య, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అవార్డుల (ఫోసా–2023) ప్రదానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజ్ఞానాన్ని అందిపుచ్చుకునేందుకు చదివే పుస్తకాలు వేరని, సమాజాన్ని అర్థం చేసుకునే పుస్తకాలు అనేకం ఉన్నాయని విద్యార్థులు వాటిని దవాలని సూచించారు. భాషపై పట్టు సాధించాలన్నారు. పీజీ కళాశాలలో లేడీస్ హాస్టల్ నిర్మాణానికి యూనివర్సిటి లేదా ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు.

**సాంకేతికతపై పట్టు సాధించాలి**

రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ మన్నే క్రిషాంక్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే తాము ఉన్నత శిఖరాలకు చేరే దిశగా స్పష్టమైన ఆలోచన ఉండాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఇంగ్లిష్, సాంకేతికతపై పట్టు సాధించాలన్నారు. తాను ఓయూ విద్యార్థిగా ఉన్న సమయంలో రాజకీయల్లోకి వెళ్లాలా, లేక ఉద్యోగం చేయాలా అని ఆలోచిస్తున్న తరుణంలో తెలంగాణ ఉద్యమం రావడంతో ఉద్యమంలో పాల్గొని పలు మార్లు జైలుకు వెళ్లి వచ్చానన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాజకీయాల్లోకి రావడం జరిగిందని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ, కవి, గాయకుడు గోరేటి వెంకన్న, శాట్ చైర్మన్ అంజనేయులు విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థులకు అవార్డులను అందజేశారు. ప్రిన్సిపాల్ ప్రొ. అర్జున్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్తీ జాదవ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆదర్శ నియోజకవర్గంగా సనత్‌నగర్

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం సనత్‌నగర్‌లోని ఎస్ఆర్‌టీలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను కాలనీల వాసులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 50 ఏళ్లలో జరగని అనేక అభివృద్ధి పనులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత గడిచిన ఎనిమిది సంవత్సరాల్లో జరిగాయన్నారు. మూడు నాలుగు నెలల్లో ఎస్ఆర్‌టీలోని సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ ఫండ్‌ను మంజూరు చేయించి అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో ఎక్కడాలేని విధంగా అత్యధికంగా 54 పార్కులు సనత్‌నగర్ డివిజన్‌లోనే ఉన్నాయని, వాటిని అందంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పార్కుల నిర్వహణకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని, పర్యవేక్షణ కోసం కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సులభంగా గుర్తించే విధంగా పార్కులకు నెంబర్లు వేసి బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కాలనీలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా విద్యుత్ తీగలు వేలాడకుండా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ అధికారులకు సూచించారు. ఎస్ఆర్‌టీలోని అన్ని రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా చూడాలని, ప్రతినిత్యం చెత్తను తరలించేలా పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలకు తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, తన దృష్టి తీసుకువచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. తన హయాంలోనే సనత్‌నగర్‌లో మంచినీటి రిజర్వాయర్ నిర్మించి నీటి సమస్యను పరిష్కరించానన్నారు. రూ.4 కోట్లతో కేఎల్ఎన్ పార్కును అద్భుతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. నెహ్రూ పార్కును రూ.3 కోట్లతో అందంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. మన బస్తీ–మన బడి కార్యక్రమం కింద సనత్‌నగర్ డివిజన్‌లో ఏడు పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలుగా అభివృద్ధి చేయడమే కాకుండా విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. సమావేశంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, డీఎంసీ మోహన్‌రెడ్డి, ఈఈ ఇందిర, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ రమేష్, ఏఎంఓహెచ్ భార్గవ్, సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి

రాంగోపాల్‌పేట్: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తిస్తూ తెలంగాణ శాసనసభలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింప చేయాలని జాతీయ దళిత క్రైస్తవ సదస్సు తీర్మాణం చేసింది. శనివారం ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) ఆధ్వర్యంలో ఎస్డీ రోడ్డులోని మెథడిస్టు చర్చిలో నిర్వహించిన సదస్సులు పలువురు ప్రముఖులు, పాస్టర్లు, ఫాదర్లు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు శాసనసభలు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కలిస్తూ తీర్మాణాలు చేశాయని తెలంగాణానూ ఈ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో క్రైస్తవులకు అవకాశం కల్పించాలనాక్నరు. పాస్టర్లపై దాడులు నివారించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్స్ చైర్మన్ రాజీవ్ సాగర్, సభ్యులు ఓరుగంటి ఆనంద్, ఏఐసీఎఫ్ జాతీయ అధ్యక్షులు గద్దపాటి విజయరాజు, బీఆర్ఎస్ నాయకులు రాయిడిన్ రోచ్ ఫాదర్ అలెక్స్, పాస్టర్ మోహన్‌బాబు, పాస్టర్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ధ్యేయం



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని మహిళల ఆర్థిక స్వావలంభనే ధ్యేయంగా శ్రీ గణేశ్ ఫౌండేషన్ పనిచేస్తోందని ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎన్. శ్రీగణేశ్ అన్నారు. శనివారం కంటోన్మెంట్ పరిధిలోని సిఖ్ విలేజ్‌లో మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. రెండు నెలల క్రితం ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి శ్రీగణేశ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ గణేశ్ మాట్లాడుతూ కంటోన్మెంట్ పరిధిలోని ప్రతి మహిళకు స్వయం ఉపాధి కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కొన్నేళ్లుగా తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. త్వరలోనే కంటోన్మెంట్‌లో గుణాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శరత్, గౌతమ్, విక్కి, భాస్కర్ గౌడ్ రాజేష్, భిక్షపతి, సునీత తివారి, సంతోషి, సంధ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

# జల దిగ్బంధం

- నీట మునిగిన అల్లంతోటబావి..
- లాలాపేట్‌లో పలు ప్రాంతాలు జలమయం



లాలాపేటలో జలమయమైన రహదారులు



సనత్‌నగర్: శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి బేగంపేట నాలా పరివాహక ప్రాంతాలు నీటమునిగాయి. అల్లంతోటబావి జలదిగ్బంధంలో చిక్కుకుని విలవిల్లాడింది. బస్తీ రోడ్లు కాలువలను తలపించాయి. ఎప్పుడు వర్షం కురిసినా లోతట్టు ప్రాంతమైన అల్లంతోటబావిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇటు మయూరిమార్గ్ వైపు నుంచి, అటు ఫాంటలూమ్స్ నాలా వైపు నుంచి వరదనీరు భారీగా అల్లంతోటబావిని ముంచెత్తడం పరిపాటి. రూ.45 కోట్లు వెచ్చించి నాలా ప్రక్షాళన, ఇతరత్రా అభివృద్ధి పనులు చేస్తున్నామని చెబుతున్నా ఎక్కువ శాతం బ్రాహ్మణవాడీ వైపునే పనులు కొనసాగుతున్నాయే తప్ప అల్లంతోటబావి గురించి ఆలోచన చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

**జలమయమైన లాలాపేట లోతట్టు ప్రాంతాలు**

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మ్యాన్ హోళ్లు, ఓపెన్ నాలాలు పొంగిపొర్లాయి. రోడ్లు, రహదారులపై బురద పేరుకుపోయింది. లాలాపేట సత్యానగర్, ఇందిరానగర్, చంద్రబాబు నగర్, శ్రీపురి కాలనీ, వినోభానగర్ తదితర బస్తీల్లోన్ని రోడ్లపై భారీగా వర్షం నీరు చేరింది. సత్యానగర్ కమ్యూనిటీ హాల్ సమీపంలోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**కార్పొరేటర్ పర్యటన**

బౌద్ధనగర్: అకాల వర్షం కారణంగా ఎదరైన సమస్యలు తెలుసుకునేందుకు కార్పొరేటర్ కంది శైలజ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు శనివారం ఆమె ఎల్ఎన్ నగర్, అంబర్‌నగర్, కౌసర్ మసీదు తదితర ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



నీటమునిగిన అల్లంతోటబావి...